నేడు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నుంచి తిరుపతి మీదుగా విశాఖపట్నం వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబర్ 18522) తుఫాన్ కారణంగా మంగళవారం రద్దు అయిందని కడప చీఫ్ కమర్షియల్ మేనేజర్ జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ విషయం గుర్తించాలని కోరారు. అలాగే కోస్తా జిల్లాలమీద నడిచే 95 రైళ్లను విజయవాడ డివిజన్ రద్దుచేసింది.


అప్రమత్తంగా ఉండాలి

● మొంథా తుఫాన్‌పై ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



కడప కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై ఆందోన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. మొంథా తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఆమె సోమవారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా చెరువుగట్లు, కాలువగట్లు తెగకుండా పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. వాగులు, వంకలు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అధికంగా వర్షాలు కురిస్తే రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు చెరువులు ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వారికి సహాయక చర్యలు, సదుపాయాలు కల్పించేందుకు సిబ్బంది 24 గంటలూ సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకు వారు పనిచేసే ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే రెవెన్యూ డివిజన్లలో పోలీసు, ఫైర్ సిబ్బందితో పాటు రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రైతులను అప్రమత్తం చేయాలని, పాడి, పశు, పంట నష్టాలు జరగకుండా పశుసంవర్ధక, వ్యవసాయ అధికారులు బాధ్యత వహించాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్యసేవలందించేలందుకు వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేకంగా సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అత్యవసర సహాయం నిమిత్తం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్లు 08562-246344, 295990తో పాటు ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రారంభమైన తుఫాన్



● అప్రమత్తంగా అధికార యంత్రాంగం
● ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటించాలి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జిల్లా వైపు దూసుకొస్తోంది. ఇప్పటికే తుఫాన్ ప్రభావం ప్రారంభమైంది. జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు ప్రారంభమయ్యాయి. తుఫాన్ దగ్గరకు వచ్చేకొద్దీ తీవ్ర ప్రభావం పడనుంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 18 కి.మీ వేగంతో మొంథా తుఫాన్ కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి చెన్నైకి 520 కిలోమీటర్లు, కాకినాడకు 570 కి.మీ, విశాఖపట్టణానికి 600 కి.మీ దూరంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉందని, పశ్చిమ వాయవ్యదిశగా కదులుతూ మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం ఉందని సూచించారు. వాతావరణం ప్రశాంతంగా ఉందని అశ్రద్ధగా ఉండవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ హెచ్చరికలు జారీచేశారు.

అప్రమత్తమైన అధికారులు

తుఫాన్ కారణంగా జిల్లాలో అధికారులు అప్రమత్తమయ్యారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అలాగే పునరావాస కేంద్రాలకు ఏర్పాట్లు చేశారు. అన్ని విధాలుగా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కంట్రోల్ రూములు

అత్యవసర సహాయ సమాచారం నిమిత్తం కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌తో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓ కార్యాలయాల్లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూములు ఏర్పాటుచేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో 24/7 పనిచేసే టోల్‌ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101లకు కాల్ చేయవచ్చు.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్	-	08562-246344
కడప ఆర్డీఓ కార్యాలయం	-	08562-295990
జమ్మలమడుగు	-	9502836762
బద్వేలు	-	6301432849
పులివెందుల	-	8919134718

జిల్లాలో తేలికపాటి వర్షం

జిల్లాలో సోమవారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు తేలికపాటి వర్షం నమోదైంది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం జిల్లాలో కేవలం ఒంటిమిట్ట మండలంలోనే 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే సాయంత్రం నుంచి రాత్రి వరకు పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది.

బుగ్గవంక పరిసరాల పరిశీలన


బుగ్గవంక ప్రాజెక్టును పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్డీవో జాన్ ఇర్విన్ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజుల పాటు కడప నగరంలో భారీ వర్షాల సూచన నేపథ్యంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి, ఆర్డీవో జాన్ ఇర్విన్‌తో కలిసి సోమవారం సాయంత్రం బుగ్గవంక డ్యామ్, పరిసర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అధికారులు బుగ్గవంక ప్రవాహ మార్గాలను, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను పరిశీలించి, సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వేగంగా స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. వారివెంట ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ పోస్టర్ ఆవిష్కరణ


ఏసీబీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు సంబంధించి ఏసీబీ అధికారులు రూపొందించిన పోస్టర్లను అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అంటించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారికి, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వాటిని ఆవిష్కరించిన అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలల్లో అవినీతికి ఆస్కారం ఉండకూడదన్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా 1064 నెంబరుకు ఫిర్యాదు చేసేందుకు ఈ పోస్టర్లు దోహద పడతాయన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునే గడువు మరోసారి పొడిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మరో మూడు నెలల పాటు అదనంగా సమయం ఇచ్చిందన్నారు. దరఖాస్తులు 2026 జనవరి 23 లోపు సమర్పించాలన్నారు. మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీఅండ్‌సీపీ) నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

'ఉపాధి' రికవరీ జరిగేనా?

● రెండునెలలుగా కాలయాపన

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ఆగస్టు నెలలో సామాజిక తనిఖీ జరిగింది. అప్పట్లో అధికారులు రూ.64వేలు దుర్వినియోగం అయినట్లు గుర్తించి ఈ మేరకు రికవరీకి ఆదేశించారు. అయితే ఇప్పటికీ ఈ మొత్తం రికవరీ కాలేదు. ఈ నేపథ్యంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి జుబేదా, ఏపీడీ రామలింగేశ్వర రెడ్డి సోమవారం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయానికి డబ్బులు రికవరీకి వచ్చారు. ఆయా గ్రామాలకు సంబంధించిన సిబ్బందిని పిలిచి విచారణ చేపట్టారు. అయితే వీరిపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చారని సమాచారం. దీంతో సామాజిక తనిఖీలో తేల్చిన సొమ్మును రికవరీ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఏపీడీ రామలింగేశ్వరరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మాకు వార్తలు, ఫొటోలు అవసరం లేదు., మా విచారణ మేము జరుపుకుంటాం అని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం గతంలో జరిగిన ఉపాధి హామీ పనులపై తిరిగి విచారణ జరిపి దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయాల్సిన అవసరం ఉందని అక్కడికి వచ్చిన కొందరు అధికారులు చెప్పుకోవడం విశేషం.

గండికోట ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తం

7

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

● ఎగ్జిబిషన్ లీజు బకాయిల ఎగవేతపై రగడ



ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, చిత్రంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. దీనికి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, ఖాజాలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆపరేషన్ చేసి చెవులు కోసిన కుక్కలనే తిరిగి పట్టుకొని వెళ్లి ఆపరేషన్లు చేసినట్లు బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇందుకు అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య మాట్లాడుతూ కుక్కలను పట్టుకునే వారు ఆపరేషన్ చేసిన కుక్కలను పొరపాటున పట్టుకున్నార న్నారు. కుక్కలకు చేసిన ఆపరేషన్‌లో ఎలాంటి అవినీతికి తావులేద న్నారు. టీడీపీ కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ లక్షలు వెచ్చించి నాటిన మొక్కలు ఏమయ్యాయని, ఇది వైసీపీ సాగించిన అవినీతి అని ఆరోపించారు. ఎగ్జిబిషన్ లీజు అనుమతులు నిబంధనల మేరకు డబ్బులు అంతా చెల్లించాక ఇవ్వాల్సి ఉంటే కమిషనర్ డబ్బులు కూడా కట్టించుకోకుండా ఇవ్వడంపై సమాధానం చెప్పాలన్నారు. ఎగ్జిబిషన్ లీజుదారుడు ఇంకా రూ.90 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఎగ్జిబిషన్ ఎంట్రీ టికెట్లు రూ.35 టికెట్టు రూ.100 పెట్టి జనం దగ్గర దోచుకున్నాడని బంగారు రెడ్డి ఆరోపించారు. దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని కోరగా.. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లా డుతూ గతంలో ఎవరెవరు ఎగ్జిబిషన్ లీజు ఎగవేశారో ప్రజలకు తెలుస న్నారు. అయినా ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ఆర్వో డేవిడ్ జోసఫ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ లీజుదారుడు ఇప్పటివరకు రూ.1.39 లక్షలు చెల్లించాడని తక్కిన మొత్తం రాబడతామన్నారు. లీజుదారుడి నుంచి చెక్కులు తీసుకున్నామన్నారు. ఈ అజెండాలో 19 అంశాలకు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ఆమోదం తెలిపారు.

శంభో శంకర..!

● శైవాలయాలకు పోటెత్తిన భక్తులు


మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మృత్యుంజయేశ్వరస్వామి శివాలయంలో అలంకారంలో స్వామివారు

కడప కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం అందునా.. మొదటి సోమవారం కావడంతో జిల్లాలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. హర హర శంభో శంకరా అనే శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. జిల్లావ్యాప్తంగా కార్తీక మాసంలో ఆధ్యాత్మిక భావం వెల్లివిరిసింది. కార్తీక దీపాలతో ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. ప్రతి శైవ క్షేత్రంలోనూ శివయ్యకు విశేషాభిషేకాలు, వ్రతాలు, నోములు, పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కడప నగరంలోని మృత్యుంజయ కుంట శివాలయం, దేవునికడపలోని సోమేశ్వరాలయం, ఆకులవీధిలో గల శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయం, గడ్డిబజారులోని కామకోటి కళాంబదేవి సోమసుందరేశ్వరస్వామి, నబీకోట శివాలయం, మోచంపేటలోని ప్రసన్న విశ్వేశ్వరాలయం, ప్రకాశ్‌నగర్‌లోని అమరేశ్వరాలయం, ఎర్రముక్కపల్లెలోని శివాలయం, అన్నపూర్ణేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, హౌసింగ్ బోర్డులో గల ఉమామహేశ్వరాలయంతో పాటు విజయ దుర్గాదేవి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించి శివనామస్మరణ చేశారు.

కిటకిటలాడిన వీరభద్రాలయం


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

చాపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం కార్తీక మాసోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. వీరభద్రస్వామిని, శివుడిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. వీరభద్రస్వామిని, భద్రకాళిని దేవస్థానం ఆవరణంలో ఊరేగింపు జరిపారు. దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ, కమిటీ సభ్యులు, సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కల్పించారు. దేవస్థానం సత్రంలోనూ, సర్వమత అన్నదాన సత్రంలో, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో, నాయీబ్రాహ్మణ బిల్డింగ్‌లో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు


ప్రొద్దుటూరులో పూల అలంకరణలో వెలిగిపోతున్న సైకత శివుడు


ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరులో కార్తీక మాస పూజలను భక్తులు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. సోమవారం కార్తీక మాసం మొదటి సోమవారం శివాలయాలన్నింటా భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించి తమ భక్తి ని చాటుకున్నారు, రామేశ్వరం ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయంలో సాక్షాత్తు శ్రీరామ చంద్రుడు ప్రతిష్ఠించినట్లు ప్రతీతి గల సైకత లింగానికి ఆలయ పూజారులు ప్రత్యేకంగా పూలతో అలంకరించి దీపాలు వెలిగించారు, ఈ దీపకాంతులు పూల అలంకరణలో ఆ పరమశివుడు భక్తులకు దర్శన మిచ్చి కనువిందు చేశారు.ఈ సందర్భంగా రామేశ్వరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



జగదాంబ సెంటర్ వీధిలో వర్షానికి రోడ్లపైకి వచ్చిన మురుగునీరు

రాయచోటి పట్టణంలోని ఠాణా సమీపంలో మురుగునీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తూ కనిపిస్తుంది. చిన్నపాటి వర్షం పడినా మురుగు మొత్తం రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఇప్పటి వరకు దాదాపు పది మంది కమిషనర్లు విధులు నిర్వహించినా ఏ ఒక్కరూ మున్సిపాలిటీని పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో భారీ వర్షాల కారణంగా మురుగు కాలువలు పొంగి నలుగురి మృతికి కారణమైన విషయం విదితమే..

- అస్తవ్యస్తంగా మురుగు కాలువల వ్యవస్థ
- విచ్చలవిడిగా కాలువల ఆక్రమణ
- రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు
- అభివృద్ధికి సహకరించని నాయకులు
- అధికారుల్లో నిర్లిప్తత

వానొస్తే.. వరదే..!

రాయచోటి - కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రాయచోటి పట్టణంలో వాగులు ప్రవహిస్తున్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉండడంతో ఎంత వర్షం పడినా ఎక్కడికక్కడ నీరు బయటికి వెళ్లిపోయేది. 2005లో మున్సిపాలిటీగా మారినప్పటి నుంచి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది.

రాయచోటి పట్టణంలో 40 వేల జనాభాకు తగిన సామర్థ్యంతో అక్కడక్కడ డ్రైనేజీలు నిర్మించారు. అవే ఇప్పుడూ ఉపయోగంలో ఉన్నాయి. 2012లో పీఎల్ఆర్ కంపెనీ వాళ్లు రూ.17 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో మురుగు కాలువల నిర్మిస్తున్నామని చెప్పి కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే నిర్మించి చేతులు దులుపుకున్నారు. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది. జిల్లా అధికారులు ఉన్నా పట్టణంలో రోడ్లు, మురుగు కాలువల వంటి కనీస వసతులు కల్పించాలన్న విషయం విస్మరించారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ. 340 కోట్లతో అండర్ డ్రైనేజీ వేస్తున్నామని హంగామా చేసిన నాయకులు, అధికారులు ఎక్కడో ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు, మూడు కిలోమీటర్లు మాత్రమే వేసి.. చేతులు దులుపుకున్నారు.ఇప్పటికైనా అధి కారులు, నాయకులు స్పందించి, డ్రైనేజీ, సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

పదేళ్ల నుంచీ ఇదే పరిస్థితి..

రాయచోటి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ దాదాపు పదేళ్ల నుంచి పూర్తిగా దెబ్బతినింది. టౌన్ ప్లానింగ్ విభాగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే తప్ప ఈ మున్సిపాలిటీ గాడిలో పడే పరిస్థితి లేదు. గతంలో ఇక్కడ పనిచేసిన టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యమే డ్రైనేజీ వ్యవస్థ దుస్థితికి కారణం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలను ఆక్రమించి మరీ ఇళ్లు కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇష్టానుసారం ఇళ్ల నిర్మాణం, మురుగు కాలువల పూడ్చివేత, కాలువలపైన ఇళ్ల



స్వల్ప వర్షానికే బురదమయమైన బస్టాండు రోడ్డు

రాయచోటి పట్టణంలో ఎక్కువగా ఉన్నాయి. రూ. 3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు సహకరించమని కౌన్సిల్‌ను పదిసార్లు అడిగినా అంగీకరించకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నాం. పట్టణ అభివృద్ధికి సహకరించని ప్రజాప్రతినిధులు ఉంటే అధికారులు మాత్రం ఏం చేస్తారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో కోచ్‌లు తదితరులు

రైల్వేకోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎం. చంద్ర మోహన్‌రాజు, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సీ. శారద మాట్లాడుతూ ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా అండర్ 46 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున బాలుర అండర్ 45 కేజీ విభాగంలో వరుణ్ కుమార్ (విజయనగరం), అండర్ 48 కేజీ విభాగం లో సి. గిరి (శ్రీకాకుళం), అండర్ 51 కేజీ విభాగంలో ఎస్. సాహిల్ (చిత్తూరు), అండర్ 55 కేజీ విభాగంలో బి. గౌతంకుమార్ (చిత్తూరు), అండర్ 59 కేజీ విభాగంలో ఓ. సువార్త (ప్రకాశం), అండర్ 63 కేజీ ఎం. కలవగిరి (ప్రకాశం), అండర్ 68 కేజీ బీకే చైతన్య (విశాఖపట్నం), అండర్ 78 కేజీ కే. రోహిత్‌కుమార్ (విజయనగరం), అండర్ 73 కేజీ బీ. జస్వంత్ (విజయనగరం), 78 కేజీ పీ. ధనుష్‌తేజ (ఈస్ట్‌గోదావరి)ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. బాలికల విభాగంలో అండర్ 40 కేజీ విభాగంలో ఎస్. కరిష్మా (అనంతపురం), అండర్ 42 కేజీ జి. కృష్ణకీర్తన (అనంతపురం), అండర్ 44 కేజీ పి. పూజిత (అనంతపురం), అండర్ 46 కేజీ పీఎస్ఎస్ఎస్ నిహారిక (ఈస్ట్‌గోదావరి), అండర్ 49 వి. హిమశ్రీ (విజయనగరం), అండర్ 52 కేజీ ఎస్. అక్సా (కడప), అండర్ 55 విభాగం పి. మేరీస్టెల్లా (ప్రకాశం), అండర్ 59 కేజీ కే. తేజశ్రీ (కృష్ణా), అండర్ 63 విభాగంలో బీఎల్ అక్షర (ప్రకాశం), అండర్ 68 కే. యామినిదేవి (విశాఖపట్నం) అండర్ 68 బి. హారిక (కడప) ను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రవి మృతదేహం

రాయచోటిటౌన్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటోను బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంబేపల్లె మండలం దిన్నెపల్లెకు చెందిన రవి (22) సోమవారం తన స్నేహితులను ద్విచక్రవాహనంపై రాయచోటి రింగురోడ్డు వద్ద దించి, మరో స్నేహితుడికోసం రాయచోటికి వస్తుండగా ఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలో ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా కుడి వైపు తిప్పడంతో వెనుకే వస్తున్న రవి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని స్థానికులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు



ముద్దాయి అరవింద్

రైల్వేకోడూరు, రూరల్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం రైల్వేకోడూరు కోర్టు న్యాయమూర్తి తేజసాయి తీర్పునిచ్చినట్లు రైల్వేకోడూరు అర్బన్ సీఐ కే. హేమ సుందరరావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం, అబ్దుల్లాపురానికి చెందిన మాదిగ అరవింద్ రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, మోటారు సైకిల్‌ను దొంగిలించాడని, ఈ రెండు కేసుల్లో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ట్రాక్టర్ దొంగతనం కేసులో నాలుగు నెలలు, మోటారు బైక్ దొంగతనం కేసులో మూడు నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు. నిందితుడిని రాజంపేట జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడదలచిన వారికి హెచ్చరికగా నిలుస్తుందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజా యి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమ వారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం, తట్టివారిపల్లె సమీపం లోని చెరువుకట్ట వద్ద శనివారం సాయంత్రం మదనపల్లె మండలం, వలసపల్లె, మొలకలదిన్నెకు చెందిన ఎరుకల శ్రీనివాసులు (35) కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన ఆనంద కుమార్ (27)ను అదుపులోకి తీసున్నామని, వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ జాఫర్ అలీ, శివకుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయి, ఒక పల్సర్ బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎరుకల శ్రీనివాసులుపై మదనపల్లె తాలూకా, టూటౌన్, ముదిగుబ్బ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురబలకోటకు చెందిన నాగరాజ కుమారుడు ప్రదీప్(19) మదనపల్లెలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సక్రమంగా చదవడంలేదని కుటుంబ సభ్యులు మందలించడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతనిఇ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 ద్విచక్రవాహనాలు సీజ్



ముదివేడు పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనర్లు నడుపుతున్న 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని అంగళ్లులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ముఖ్యంగా మైనర్లు, యువత అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి - నేతాజీ సర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారాన్ని నేరుగా పర్యవేక్షిస్తోందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాయచోటి బోస్ నగర్‌కు చెందిన షేక్. షబానాకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించినట్లు హెచ్ఏఎస్ఎఫ్ 230525042284గా ఆన్‌లైన్‌లో చూపుతున్నదని, కానీ ఆమెకు ఇప్పటి వరకు ఎలాంటి పట్టా ఇవ్వలేదని, ఈ విషయాన్ని పరిశీలించి ఇంటి స్థలాన్ని ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. తన భర్త 2009, సెప్టెంబరు 3న మరణించాడని, తనకు మంజూరైన వితంతు పింఛనును ఈ మధ్య కాలంలో నిలిపేశారని, దానిని పునరుద్ధరిం చాలని నిమ్మనపల్లిపరిధిలోని కొండయ్యగారిపల్లెకు చెందిన రాజ మ్మ విన్నవించుకున్నారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్ అర్జీలు స్వీకరించారు.

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

● జిల్లా సాధన సమితి డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి నాయకులు

మదనపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ కొలిక్కి రావడం హర్షణీయమని, మంగళవారం జరిగే మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించేందుకు మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం సీఎంతో భేటీ అవుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక బాస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెను జిల్లా కేంద్రం చేసేందుకు సాధ్యాసాధ్యాలపై నివేదికలో వివరించనున్నట్లు వెల్లడైన విషయం ఇక్కడి ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇలాంటి అపోహలకు, ఆందోళనలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా మంగళవారం ఉపసంఘంతో జరిగే భేటీలో సీఎం ప్రకటన చేసి స్పష్టత ఇవ్వాలని కోరారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో పాటు యర్రావారిపాలెం, చిన్నగొట్టిగళ్లు మండలాల ప్రజల విజ్ఞప్తి మేరకు ఆ రెండు మండలాలను కూడా మదనపల్లె జిల్లాలో కలపాలని కోరారు. మంగళవారం మదనపల్లెలో నిర్వహించతలపెట్టిన బిగ్ డిబేట్‌ను తుఫాను కారణంగా నవంబరు 4వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సాధన సమితి కోకన్వీనర్ రెడ్డిసాబ్, తోపు కృష్ణప్ప, శ్రీచందు, దుగ్గిరెడ్డి ప్రభాకర్, బాస్ నాయకులు తలారి కృష్ణ, గంగాధర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుదాం..!

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల్లో సత్తా చాటుదామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ నేతలతో కలసి మండలంలోని కన్నెమడుగు, రేణుమాకులపల్లె, ఎద్దులవారిపల్లెల్లో ముమ్మరంగా పర్యటించారు. పలువురు నేతలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎవ రికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వర్గాలు వీడి అందరం కలసికట్టుగా పనిచేసి వచ్చే సంస్థాగత ఎన్నికల్లో శత శాతం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసి తంబళ్లపల్లెలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొద్దామన్నారు. మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, మునాఫ్, సిద్దారెడ్డి, బాసూసాబ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో కేదారేశ్వర వ్రతం





ప్రత్యేక అలంకారంలో అఘోర లింగేశ్వరుడు,కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కేదారేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగేశ్వరస్వామి, కేదారేశ్వర వ్రత పూజా విధానము, పూజా విశిష్టత భక్తులకు వివరించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అఘోరలింగేశ్వర స్వామి ఆలయంలో వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

గుండాలకోనకు రావద్దు

● భక్తులకు సీఐవిజ్ఞప్తి

చిట్వేలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో గుండాలకోన కర్కటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రావద్దని సీఐ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. కోన నుంచి నీరు ఉధృతంగా వచ్చే అవకాశం ఉన్నందున, చుట్టుపక్కల వంకల్లో ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల కోన సందర్శనను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భక్తులను ఇతర ప్రాంతాలకు తరలించామని వివరించారు. కొత్తగా ఎవరూ వచ్చేందుకు ప్రయత్నించరాదని తెలిపారు.

పీహెచ్‌సీలో మలేరియా అధికారి తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆకస్మింగా తనిఖీ చేశారు. ల్యాబ్ స్థితిగతులు, రికార్డులు, ల్యాబ్ నెలవారీ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధామాధవి, శైలజ, సబ్-యూనిట్ విద్యాసాగర్, సీహెచ్‌వో సరస్వతి, ఆరోగ్య పర్యవేక్షకులు చిన్నప్ప, సిబ్బంది రాజమణి, హెచ్ఈ కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మునీర్, ఫార్మసిస్ట్ యుగంధర్, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకులం విద్యార్థి



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీసీ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎస్.నిత్య ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి డిస్కత్రో, షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి హర్యానాలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలియజేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఫస్టియర్ సీఈసీ చదువుతున్న కె.మానస రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ఇంటర్ విద్యార్థినులకు నీట్, జేఈఈ ప్రవేశాలకు ఈ పతకాలు ఉపయోగపడతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పాటూరు విద్యార్థినులు



నక్షత్ర



యేసుప్రియ



శివమంజుల

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కడప పట్టణంలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన అండర్ 14, అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.యేసుప్రియ, బి.నక్షత్ర, అండర్-14 విభాగంలో, ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిరువురు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు, అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచిన కె.శివమంజుల తూర్పుగోదావరి జిల్లా కోవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవీలత మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుతూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ ఎం.సుస్మిత, పీఈటీ పి.జగన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు

పీలేరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.3కోట్లతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ కమలాకర్ రెడ్డి, ఏఈ రామకృష్ణనాయక్ తెలిపారు. అగ్రహారం పంచాయతీకి రూ.14.25 లక్షలు, బోడుమల్లువారిపల్లెకు రూ.10లక్షలు, దొడ్డిపల్లె పంచాయతీకి రూ.22.50 లక్షలు, గూడరేవుపల్లెకు రూ.9.30లక్షలు, జాండ్లకు రూ.10లక్షలు, కాకులారంపల్లెకు రూ.9.50లక్షలు, కావలిపల్లెకు రూ.12లక్షలు, మేళ్లచెరువుకు రూ.9లక్షలు, పీలేరుకు రూ.82.70లక్షలు, రేగళ్లకు రూ.30లక్షలు, తలపులకు రూ.34.25లక్షలు, వేపులబైలుకు రూ.21.50 లక్షలు, యర్రగుంటపల్లెకు రూ.12.50లక్షలు, ముడుపుల వేములకు రూ.12.50లక్షలు, బాలంవారిపల్లె పంచాయతీకి రూ.10 లక్షలతో సీసీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పనులు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

చెవిరెడ్డి పీఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా గతంలో పనిచేసిన (రేణిగుంట పంచాయతీ సెక్రటరీ) గుర్రాల శ్రీనివాసులుపై ఆయన సోదరుడి కుమారుడు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసులు సోదరుడు గుర్రాల మణికంఠ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మణికంఠ కథనం మేరకు తమ కుటుంబానికి పీలేరు మండలం ముడుపులవేముల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.510లో వారసత్వంగా సంక్రమించిన 4.13 ఎకరాల భూమి ఉండేదన్నారు. తల్లిదండ్రులిద్దరూ తన చిన్నతనంలోనే కన్నుమూయడంతో మేనమామ వాళ్ల దగ్గర ఉంటున్నానని తెలిపాడు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి వద్ద పనిచేస్తున్న తన పెద్దనాన్న పీలేరులోని అధికారులను భయపెట్టి ఆ భూమిని ఈనెల 21వ తేదీ తన పేరిట రిజిస్టర్ చేసుకున్నాడన్నారు. తాను, తన మేనత్తలు పలుమార్లు వేడుకున్నా తమకు న్యాయంగా రావాల్సిన భాగాలను ఇవ్వలేదన్నారు. తనకు, తన మేనత్తలకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

హార్సిలీహిల్స్‌లో కార్తీక వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ సెక్షన్‌ఆఫీసర్ శివకుమార్

బి.కొత్తకోట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. టూరిజం, అటవీశాఖ సిబ్బంది స్థానికులతో కలిసి కొండపై ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏనుగుమల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఏపీ టూరిజం మేనేజర్ కొల్లిశ్రీధర్‌తో కలిసి సెక్షన్ ఆఫీసర్ శికుమార్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు వృక్షాలను రక్షించాలని, ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయం... గందరగోళం

- గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో వైద్యశాఖ ఉద్యోగులకు తప్పని తిప్పలు
- బదిలీలతో రెండవ ఏఎన్ఎంల పరిస్థితి అయోమయం
- ఆ జీవోలను రద్దు చేయాలంటూ ప్రభుత్వంపై వత్తిడి

కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) గతంలో జగన్ సర్కారులో ప్రజలకు ఉచిత వైద్యమంటూ తీసుకొచ్చిన రీడిప్లయ్మెంట్, 143 జీవోలు వైద్యశాఖలో ఉద్యోగులను గందర గోళపరిస్థితికి నెట్టాయి. ఆజీవోలు అమలు మాట దేవుడెరుగు రెగ్యులర్ ఏఎన్ఎంలను, అరకొర జీతాలతో ఏళ్ల తరబడి రెగ్యులర్ కాని రెండవ ఏఎన్ఎంలను జిల్లా, అంతర్‌జిల్లాల బదిలీలతో వైద్యశాఖను అవినీతిమయం చేశారనే విమర్శలున్నాయి. అప్పటి ప్రభుత్వ పెద్దల పెత్తనంతో మంచీ చెడూ చెప్పకుండా దూడూ బసవన్నలా వ్యవహరించిన కొందరు అధికారులు, అప్పటి సంఘనాయకులతో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని.. ప్రక్షాళన చేయాలంటూ తెలుగునాడు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమయ్యారు. జగన్ సర్కారు తెచ్చిన రీడిప్లయ్మెంట్ విధానం రద్దుకు వైద్యశాఖలో కొన్ని విభాగాల ఉద్యోగులు కూటమి సర్కారుపై ఒత్తిళ్లు పెంచేందుకు సిద్ధమయ్యారు.

సచివాలయ వ్యవస్థతోనే తిరకాసు

వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చింది. అప్పటి నుంచి ఏఎన్ఎంల బదిలీలు, స్టాఫ్ నర్సుల శిక్షణలంటూ ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలలో పనిచేసే రెగ్యులర్, రెండో ఏఎన్ంలను, జిల్లా క్యాడర్ ఉద్యోగులను జిల్లా మారుమూలలకు బదిలీలు చేసి వైద్య శాఖలో ఉచిత వైద్యం చేయాల్సిన వారిలో వైసీపీ వ్యతిరేక విధానాలతో విసిగిపోయారు. ప్రాథమిక కేంద్రానికి 14 మంది సిబ్బంది అంటూ అశాస్త్రీయంగా 143 జీవో రీడిప్లయ్మెంట్ విధానాన్ని తెచ్చి ఆశాఖ ఉద్యోగులతో ఆడుకున్నారనే విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను తెచ్చి అందులో మూడో ఏఎన్ఎంలను నియమించారు. అయితే ఆరోగ్య ఉప



కేంద్రాలలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలు ఉన్నారు. సచివాలయం ఏఎన్ ఎంలను కలుపుకుంటే ఎక్కువ మంది ఉన్నారని ఆలస్యంగా గ్రహిం చిన అధికారులు కొంతమందిని రెండేళ్ల స్టాఫ్ నర్సు శిక్షణకు పంపారు. శిక్షణకు పంపిన వారి స్థానంలో రీడిప్లయ్మెంట్ విధా నంలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలను ఇష్టారాజ్యంగా 50-150 కిలోమీటర్ల దూరప్రాంతాలకు బదిలీ చేసి వైద్య ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు తెచ్చారంటున్నారు. వీరిలో మండలాల్లో చాలీ చాలనీ జీతాలతో పనిచేసే రెండవ ఏఎన్ఎంల పరిస్థితి దారుణంగా మారింది. ఇక పీహెచ్‌సీలకు సంబంధించి 14 మంది సిబ్బంది అంటూ 143 జీవో తెచ్చి అందులో నలుగురు పర్యవేక్షణ సిబ్బంది పేరుతో ఉత్తర్వులు జారీ చేసి నేటికి అమలు లేదు. దీంతో గత జగన్ సర్కారులో ఇచ్చిన జీవోలతో అన్ని క్యాడర్లలో ప్రమోషన్లకు గండి కొట్టారంటూ ఆందోళనబాటకు శ్రీకారం చుట్టారు.

బదిలీల్లో అవినీతికి పరాకాష్ట

వైద్య శాఖలో అన్ని క్యాడర్లను పొంతన లేకుండా నియమించి.. వైద్య ఉద్యోగుల బదిలీల్లో ఎల్‌డీసీ పోస్టుకు యూడీసీ పోస్టులతో ముడిపెట్టి వైద్య ఉద్యోగులను గందర గోళపరిస్థితులకు నెట్టారు. నాన్పుడు ధోరణిలో ప్రమోషన్లకు ఎసరు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా క్యాడర్‌కు, జోనల్ క్యాడర్‌కు రాష్ట్ర క్యాడర్లను జోనల్ సంచాలకులు అశాస్త్రీయమైన పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించి అప్పటి ప్రభుత్వ విధానాలకు అవినీతి ఆజ్యం పోశారంటూ విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానలను ఎండగడుతూ కూటమి సర్కారులో రీ డిప్లయ్మెంట్ విధానం రద్దుకు తెలుగునాడు వైద్య అసోషియేషన్ ఉద్యమ బాటకు సిద్ధమైంది. ఈమేరకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఐక్యతతో నిరసనల ద్వారా గత ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రక్షాళన చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు.

పొలంలోనే కుళ్లిపోతున్నాయి...

- ధర లేక ఉల్లి రైతుల కష్టాలు



దువ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ధరలేక పంటను కొనుగోలు చేసేవారు లేక ఆవేదన చెందుతు న్నారు. చేతికందిన పంటను పొలంలోనే వదిలేసి కన్నీటి పర్యంతమవుతున్నారు. 15 నుంచి 20 రోజుల కిందట పొలం నుంచి తీయాల్సిన ఉల్లిపంటను చేసేది లేక భూమిలోనే వదిలేస్తున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేటతో పాటు పలు మండలాల్లో పెద్దబళ్లారి రకం ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. అప్పులు చేసి పెట్టుబడులకు డబ్బులు సమకూర్చుకుని పంట సాగు చేశారు. నిరుడు, అంతకుముందు సంవత్సరాల్లో పెద్దబళ్లారికి గిరాకీ ఉండడం, అప్పట్లో మంచి ఆదాయాలు రావడంతో ఈ పంట సాగుపై చాలా మంది రైతులు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ధర లేక కొనుగోలు చేసే వారు లేకపోవడంతో వీరిలో నిరాశ, నిస్పృహ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎప్పుడో తీయాల్సిన ఉల్లిని తొలగించకపోవడంతో వర్షాలతో దెబ్బతిని కుళ్లు సోకుతుండడంతో సంబంధిత రైతు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు లక్షల్లో నష్టాలను మూటకట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పది ఎకరాలు కౌలుకు తీసుకున్నా...

పది ఎకరాలు కౌలుకు తీసుకుని పెద్దబళ్లారి రకం ఉల్లి పంట సాగు చేశాను. ఆరు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. రెండేళ్ల కిందట మంచి లాభాలు వచ్చాయి. ధర లేక పరిస్థితులు తిరగబడ్డాయి. కౌలు పొలమే నాకు ఆధారం. ఏమీ పాలుపోవడం లేదు.

- వెన్నపూస పెద్దకొండారెడ్డి, గుడిపాడు గ్రామం.

పరిహారం అందజేయాలి



నేను సాధారణ కౌలు రైతును. పరిస్థితులు అనుకూలిస్తే మంచి ఆదాయం వస్తుందనుకున్నాను. ధర లేక ప్రస్తుతం పీకల లోతు అప్పుల్లో మునిగాను. ప్రభుత్వం కొనుగోలు చేయడమో, పరిహారం ఇవ్వడమో చేయాలి. లేదంటే మాలాంటి పేద రైతులు కోలుకోవడం కష్టం.

- మిట్టా శివారెడ్డి, రైతు, గుడిపాడు గ్రామం

ప్రారంభమైన బీఎడ్ పరీక్షలు



పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధి ఉమ్మడి కడప జిల్లాలోని 17 కేంద్రాలలో బీఎడ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను 21,665 మంది విద్యార్థులు రాస్తున్నారు. తొలి రోజు కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, కేంద్రంలోని పరిసరాలను పరిశీలించారు. పరీక్షలు నిబంధనలను అనుసరించి కట్టుదిట్టంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వివరిస్తూ రెండు జిల్లాలోని అన్ని కేంద్రాలకు విశ్వవిద్యాలయం తరపున అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. అలాగేస్క్వాడ్ బృందాల సభ్యులు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని వీసీకి వివరించారు.

వైద్యశాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ రీజియన్ పరిధిలోని అన్ని క్యాడర్లలోని ఉద్యోగులకు అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్యలు సోమవారం వినతి పత్రం అదజేశారు. ఈసందర్భంగా ఎన్జీవో అధ్యక్షుడు మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప తదితర జిల్లాల్లో మహిళాసూపర్ వైజర్లకు పీహెచ్ఎన్‌గా, ఎంపీహెచ్ఎస్‌లకు ఎంపీహెచ్ఈవో, హెల్త్ ఎడ్యుకేటర్‌లకు డిప్యూటీ డెమోలుగా సీనియర్ ఫార్మసీలను చీఫ్ ఫార్మసీ అధికారులుగా, ఏఎన్ఎంలను ఎంపీహెచ్ఏలుగా, ఎంపీహెచ్ఏల నుంచి ఎంపీహెచ్ఎస్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పదోన్నతుల కల్పించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే చాలా మందికి పదోన్నతులు రాక నిరీక్షించి రిటైర్మెంట్ అవుతున్నారని మెడికల్ ఆర్డీకి విన్నవించారు. సీనియార్టీ లిస్టు రెడీ చేసి, త్వరలో పదోన్నతులకు కృషి చేస్తామని మెడికల్ ఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మనాభరావు, కంబదూరు, మధు బాబు, ఆది బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నర్సాపురం బాలిక



కాశినాయన అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కె.భాగ్యలక్ష్మి అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు గురయ్య తెలిపారు. మండల, నియోజకవర్గ పోటీల్లో నెగ్గిన భాగ్యలక్ష్మి కడపలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచింది. దీంతో త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ఆడనున్నారన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని ఎంఈవోలు మహమ్మద్ షఫీ, పాఠశాల ఉపాధ్యా యులు అభినందించారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996ను అమలు చేసి, పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా సంక్షేమ బోర్డును పునరుద్దరణకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని మార్గాల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి అధికారులు ఆదేశించారు. సోమవారం కడప నగరం మాసాపేట సర్కిల్ నుంచి దర్గా వరకు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ మరమ్మత్తులు, రోడ్లలో గుంతలు పూడ్చడం, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయడంపై అధికారులను ఆదేశించారు. వైవీ స్ట్రీట్, వన్‌టౌన్ సర్కిల్ పరిసరాల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషనర్ పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, ధనలక్ష్మి, హార్టికల్చర్ ఏడీ నాగమణి, డిప్యూటీ ఈఈ కృష్ణకుమార్, ఏఈలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులురెడ్డి, పూర్ణచంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి



అవినీతిపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆర్టీపీపీలో సోమవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు అవినీతికి సంబంధించి చీఫ్ ఇంజనీర్ అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణయ్య, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్దయ్య, విజిలెన్స్ సీఐ నారాయణయాదవ్, ఎస్ఈలు, ఇంజనీర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తం



ప్రాజెక్టు వద్ద నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొండాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపధ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండటంతో ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.5 టీఎంసీల నీటిమట్టం ఉందన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 4750 క్యూసెక్కులు ఉండగా, మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కులు వదులుతున్నామన్నారు. తుఫాన్ ముగిసే వరకు ప్రాజెక్టు వద్దనే నిద్రించనున్నట్లు ఆయన తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరంజలాశయం నుంచి పెన్నాకు నీరు విడుదల

మైలవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 4,300 క్యూసెక్కుల నీటిని సోమవారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నట్లు ఆ జలాశయ అధికారులు తెలిపారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అయిదు వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందని, దీంతో ఉత్తర, దక్షిణ కాలువలకు 200 క్యూసెక్కులు, పెన్నాదికి 4,300 క్యూస్కెలు నీటిని విడుదల చేస్తున్నారు. మైలవరం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.076 టీఎంసీల నీరు నిలువ ఉంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు, పోలీసులు తెలిపారు.

మెగా డీఎస్సీ-25లో న్యాయం చేయాలి

- పాఠశాల విద్యా కమిషనర్‌కు లేఖ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో తనకు న్యాయం చేయాలని డీఎస్సీ అభ్యర్థి మూడే జగదీష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల విద్య కమిషనర్ కోన శశిధర్‌కు ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ 2025కు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కాల్ లెటర్ వచ్చినప్పటికీ, గ్రీవెన్స్ ద్వారా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ జనరల్ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో రోస్టర్ లోపాల కారణంగా తనకు అన్యాయం జరిగిందని తెలిపారు. రోస్టర్ పాయింట్-58లో మహిళా అభ్యర్థిని నియమించడం వల్ల తాను రెండో అర్హుడిగా ఉన్నప్పటికీ విస్మరించారని తెలిపారు. జీవో నెంబర్ 77 ప్రకారం క్యారీ ఫార్వర్డ్ పోస్టుల విధానం స్పష్టంగా లేనందున తనకు న్యాయం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలి

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్చలు జరపాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. సోమవారం జరిగిన రీజియన్ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మంత్రి చొరవ చూపాలన్నారు. ఆరు సంవత్సరాలుగా విద్యారంగం పాఠశాల విద్యాశాఖ ప్రయోగాలకు నెలవుగా మారిందన్నారు. తిరోగమన విద్యా విధానాలు ప్రభుత్వ పాఠశాల విద్యా రంగాన్ని బలహీనపరుస్తూ, ఉపాధ్యాయుల సంఖ్య కుదిస్తూ ప్రైవేటు, కార్పొరేటుకు ఊతమిచ్చేలా ప్రభుత్వ విధానాలున్నాయన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా మంచి జరుగుతుందని ఆశించామని ఎటువంటి అనుకూల నిర్ణయాలు ఇంతవరకు వెలుడవలేదన్నారు. సానుకూల వాతావరణంలో మంత్రి చర్చలు జరపాలని కోరారు. నాయకులు సురేస్‌బాబు, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాబు, సంగమేశ్వర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై విచక్షణా రహితంగా దాడి.. తీవ్ర గాయాలు

కడప క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని గంజికుంటకాలనీ గుర్రాల షెడ్డు సమీపంలో 17 ఏళ్ల బాలు డిపై అతని మేనమామ మరో వ్యక్తితో కలిసి విచక్షణారహితంగా దాడి చేశారు. నకాశ్ ప్రాంతానికి చెందిన ఇరువురు యువకులు, మరో బాలుడితో కలిసి టీవీఎస్ వాహనాన్ని దొంగతనం చేశారు. ఆ వాహనాన్ని అమ్మి వచ్చిన డబ్బులతో ఇతర ప్రాంతాలకు వెళ్లి జల్సా చేశారు. తరవాత బాలుడిని వదిలేసి మిగిలిన ఇద్దరు కడపకు వచ్చారు. దీంతో బాలుని గురించి బంధువులు ఆరా తీశారు. పోలీసులను ఆశ్రయించి ఇతర ప్రాంతంలో బాలుడు ఉన్నాడని తెలుసుకుని అక్కడికి వెళ్లి తీసుకువచ్చారు. తరువాత తమ బాలుడు ఇంటి నుంచి వెళ్లడానికి కారణమైన వారిపై దారుణంగా దాడి చేయడంతో ఆసంఘటనను సెల్‌ఫోనులో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో కాస్త వైరల్‌గా మారింది. దీంతో మా బిడ్డను మీ వాడే తీసుకెళ్లాడని.. ఇంకో బాలుడి బంధువు తీసుకెళ్లిన బాలుడి మేనమామకు చెప్పాడు. దీంతో ఆ బాలుడి మేనమామతో పాటు మరో బాలుడి బంధువు కూడా ఆ బాలున్ని చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఖాదర్, మున్నా, ముబారక్‌పై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు.

సగిలేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిశెట్టిపల్లె గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చిన్నపెంచలయ్య ఉరఫ్ ప్రభాకర్ శనివారం సగిలేరులో జారి పడిన విషయం విదితమే. సోమవారం ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమై నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఆదివారం బోడిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కోట నాగమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్న పెంచలయ్య డప్పు వాయించేందుకు వెళ్లాడు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత కాళ్లు కడుక్కునేందుకు సగిలేరు వద్ద నీటిలో దిగగా ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతయ్యాడు. స్థానికులు సమాచారం మేరకు వెంటనే ఫైర్ సిబ్బంది బోటు సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడేవరకు వెతికినా మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం తిరిగి జరిపిన గాలింపు చర్యల్లో గల్లంతైన చిన్నపెంచలయ్య మృతదేహం లభించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఐదుగురు సంతానం కలరు. కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేలు సీఐ క్రిష్ణయ్య, ఫైర్ ఎస్ఐ చంద్రుడు, సిబ్బంది ఉన్నారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య

అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరాజు పల్లె గ్రామానికి చెందిన కె.సుబ్బారెడ్డి (45) విషద్రావణ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామక్రిష్ణ వివరాల మేరకు... సుబ్బారెడ్డి కొద్దిరోజుల క్రితం కరెంటు స్తంభంపైకి ఎక్కి విద్యుత్ వైరు పరిశీలిస్తుండగా జారి పడడంతో అతని వెన్నెముక దెబ్బ తింది. దీంతో అతను మంచానికే పరిమితమయ్యాడు. ప్రతి రోజూ తన పరిస్థితిని చూసి కలతచెందేవాడు. ఈ క్రమంలో సోమ వారం మద్యం తెప్పించుకుని అందులో విషద్రావణం కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోండి

● తహసీల్దారుకు వినతిపత్రం

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాడు పంచాయతీ బంగ్లేషావలి దర్గా సమీపంలోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల చలపతి, స్థానిక నేతలు చదిపిరాళ్ల రామచంద్రారెడ్డి, చింతకుంట యోగీశ్వర్‌రెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు సరస్వతికి వారు వినతిపత్రం అందించారు. సదరు భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి పండ్ల మొక్కలు పెంచుతున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మండలంలో కబ్జాలు చేయడం పెరిగిందని, అలాంటి వారికి రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దారు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం పనితీరు, రాజ్యాంగ అమలుపై మేధావి వర్గం మాట్లాడి ప్రజల్లో అవగాహన కల్పించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థ, మూఢనమ్మకాలు, విద్య, సామాజిక సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, వైద్యుడు జీఎస్ రామగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ సమయంలో ఎక్కువ విజ్ఞానం అందేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. పి.సనావుల్లా సాంకేతిక విద్యపై అవగాహన పెంపు అవసరమన్నారు. హైదర్‌వల్లి విజ్ఞానం ప్రజల చేతికి చేరాలంటే జనవిజ్ఞాన వేదిక వంతు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, యలేశ్వరరావు, వెంకటరమణ, మల్లికార్జున, గౌరీశంకర్ తదితరులు మాట్లాడారు.

నేడు టెంకాయల విక్రయాలకు టెండర్లు

చక్రాయపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో టెంకాయలు విక్రయించుకునే హక్కుకై మంగళవారం టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు టెండర్లు, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం ఉంటుందని, టెండర్‌దారులు రూ.10 లక్షలు డీడీ కానీ నగదు రూపంలో కానీ చెల్లించి టెండర్లలో పాల్గొనాలని కోరారు.

కార్తీక మాసాన.. భక్తులు మురిసేనా..

● కిటకిటలాడిన శివాలయాలు ● ప్రత్యేక పూజలందుకున్న కైలాసనాథుడు



ప్రత్యేక అలంకరణలో పొలతల మల్లికార్జునుడు, చెన్నూరు మల్లేశ్వరాలయంలో శివుడు, వేంపల్లెలో గవిమల్లేశ్వరుడు

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు తెల్లవారుజాము నుంచే శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు రద్దీగా మారాయి. స్వామిఅమ్మవార్లను దర్శించుకొని పునీతులయ్యారు. కార్తీక మాసాన.. భక్తులు పరవసించిపోయారు.

పెండ్లిమర్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారంగా పొలతల మల్లికార్జునుడు విరాజిల్లుతున్నాడు. వేకువజాము నుంచే భక్తులు కోనేర్లలో స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లతో పాటు, అక్కదేవతలను దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలను ప్రధాన ఆలయం, అక్కదేవతల గుడి వద్ద వెలిగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ కృష్ణా నాయక్, చైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెన్నూరు: స్థానిక చెన్నూరు మల్లేశ్వర ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మూలవిరాట్ మూర్తికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయంలో శివునికి ప్రత్యేక అలంకరణ చేశారు. దర్శనానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఆర్ అండ్‌బీ రోడ్డులోని నాగేశ్వరాలయం, ఉప్పరపల్లె నాగలింగేశ్వరాలయం, కొండపేట ఉమామహేశ్వరాలయాల్లో పూజలు జరిగాయి.

వేంపల్లె: పాపాఘ్నినదీ ఒడ్డున కొండగుహలో వెలసిన గవిమల్లేశ్వరుడు అర్ధనారీశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక మహోత్సవ వేడుకలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే పాతపేట శివాలయంలో వెలసిన భవాని నీలకంఠేశ్వర స్వామికి పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ పూజారి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంలో నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కమలాపురం రూరల్: మండల పరిధిలోని చదిపిరాళ్ల, కమలాపురం, ఎర్రగుడిపాడు, పెద్దచెప్పలి, కంది వరదరాజస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. చదిపిరాళ్ల కంచి వరదరాజస్వామి ఆలయంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక తొలి సోమవారం రోజున శివయ్యకు చేసే ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

సీకేదిన్నె: మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బుగ్గ శివాలయం, బయనపల్లె ఉమామహేశ్వర ఆలయం, గంగమ్మతోపు, ఊటుకూరు శివాలయం, విశ్వనాథపురం తదితర ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

గ్రామాల్లో పర్యటించాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రతి గ్రామంలో అధికారులు తప్పనిసరిగా పర్యటించి తుఫానుపై ప్రజలను అప్రమత్తం చేయాలని మండల స్పెషలాఫీసర్, స్టెప్ సీఈఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన పెండ్లిమర్రిలో పాత ఇళ్లను, నివాసాలను అధికారులతో కలిసి పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీకేదిన్నె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. రెండు రోజులపాటు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుర్రంగుంపు డ్యాం వద్ద నీటి ప్రవాహాన్ని ఆర్డీవో జాన్ ఇర్విన్‌తో కలిసి సందర్శించారు. అనంతరం చింతకొమ్మదిన్నె, తాడిగొట్ల, కొప్పర్తి చెరువులను పరిశీలించి కొప్పర్తి చెరువును పరిశీలించారు. సీఐ బాలమద్దిలేటి తహసీల్దారు వెంట సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

పులివెందులటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రమబద్ధీకరణకు మూడు నెలలు అంటే 23.01.2026 వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరించుకోని ప్లాట్లకు, బిల్డింగ్ అనుమతులు మంజూరు చేయబడవన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతికి ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రౌన్ శాస్త్రిగా ఖ్యాతిగాంచిన డాక్టర్ జానమద్ది హనుమత్ శాస్త్రి శతజయంతి ఉత్సవాలకు రావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆహ్వానం అందించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ వెంకయ్యనాయుడి స్వగృహంలో కలిశారు. కాగా జానమద్ది హనుమత్‌శాస్త్రి తెలుగు సాహితీ సేవలను స్మరించారు. ఆయన రచనలు కొత్త తరాలకు ఆదర్శమని కొనియాడారు.



వెంకయ్యనాయుడుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న విజయభాస్కర్

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాను ప్రభావం వల్ల విపరీతమైన వర్షం కురిసి పొలాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. మండలంలో దెబ్బతిన్న వరిని సోమవారం ఆమె పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. పొలాల్లో నిలిచే నీరు వెళ్లేందుకు రైతులు ముందుగానే ప్రధాన పొలంలో దారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాలు కురిసిన తరువాత నాలుగైదు రోజుల్లో ఎరవులు కానీ పురుగుమందులు కానీ వేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు యూరియా అందించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీదేవి, ఏఈవో లక్ష్మి, రెడ్డినాగేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించండి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న, వంగిన విద్యుత్ స్తంభాలను తక్షణమే విద్యుత్ అధికార యంత్రాంగం పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సాయిపేట, రూకవారిపల్లె ప్రాంతాల్లో సీపీఎం ప్రతినిధి బృందం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని వాటిని పరిశీలన చేయాలని కోరారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం : విజయజ్యోతి

కడప కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేలా లక్ష సంతకాల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన ఓట్ చోరీ కార్యక్రమంలో బాగంగా జిల్లాలో ఇప్పటివరకు 67 వేల మందితో సంతకాలు సేకరణ చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సంతకాల సేకరణలో ఐదవ స్థానంలో నిలిచామన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేది వరకు సమయం ఉన్నందున లక్ష సంతకాల సేకరణ పూర్తి చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని నియోజకవర్గ నాయకులను, కాంగ్రెస్ శ్రేణులు, నాయకులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో నిలపడం జరుగుతోదన్నారు. జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటని, కష్టపడి పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో విజయం సాధ్యమన్నారు. అనంతరం సంతకాల సేకరణలో పని చేసిన నియోజకవర్గ నేతలకు దీపావళి గిఫ్ట్ బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్, నియోజకవర్గ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాష, శివమోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విజయకుమార్, నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌డీ విజయజ్యోతి

ముందస్తు చర్యలు చేపట్టాలి : ఎస్‌ఈ

వీరపునాయునిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణ, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ అన్నారు. సోమవారం వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో నదీతీర ప్రాంతంలోని వీరపునాయునిపల్లె మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బందితో అయ్యవారిపల్లెలో 33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఎస్‌ఈ రమణ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో నీటిమట్టం పెరిగిన సందర్భంగా పరివాహక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

పులివెందుల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రం ఏర్పాట్లను అధికారులు సోమవారం పరిశీలించారు. పట్టణంలోని న్యాక్ హాస్టల్ భవనాలు, వైఎస్సార్ ఇస్టా భవనాలను పరిశీలించారు. తుఫాన్ వల్ల ప్రజలకు సమస్యలు ఉత్పన్నమైతే పునరావాస కేంద్రంలో అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఆర్ఐ షెక్షావల్లిలు తెలిపారు.

తుఫాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి పరిమళజ్యోతి

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి పరిమళ జ్యోతి తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తుఫాను విషయమై అలర్ట్ చేస్తూ రెండురోజుల పాటు పాఠశాలలకు కూడా సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందేనని, సోమ, మంగళ, బుధవారాల్లో తుఫాను తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఆ మేరకు ప్రతి అధికారి తన పరిధిలో ప్రభుత్వం తెలిపిన విధులను సక్రమంగా బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే వీఆర్వోలు, వీఆర్‌ఏలకు విధులు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏవో శ్రీదేవి, ఇంజనీర్లు ఉమామహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎస్‌ఐ సుధాకర్ పాల్గొన్నారు.

బుగ్గవంక నీరు రాకుండా చర్యలు తీసుకోండి

● కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక ప్రహరీ గోడకు ఉన్న రంధ్రాలను ఇసుక బస్తాలతో పూడ్చి, ఆ నీరు నగరంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుగ్గవంక ప్రహరీగోడకు మధ్యలో గ్యాప్‌లు ఉండడంతో వర్షాకాలంలో బుగ్గవంక నీరు నగరంలోకి చొచ్చుకు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ముఖ్యంగా 31వ డివిజన్‌లోని జువైనల్ హోం సమీపంలో గోడ మధ్యలో ఉన్న పెద్ద గ్యాప్ కారణంగా నీరు టౌన్‌లోనికి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షాల వల్ల ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు పాకా సురేష్, అస్మతుల్లా, షఫీ, బసవరాజు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి సబ్సిడీ



కొక్కిరాయపల్లెలో మహిళా రైతులకు వివరాలు తెలుపుతున్న ఏపీవో

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఐదెకరాల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులు తమ భూములను పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీతో మొక్కలు అందిస్తామని ఏపీవో శైలజ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని చెన్నూరు, శివాలపల్లె, కొక్కిరాయపల్లె గ్రామాల్లో ఇంటింటా తిరిగి రైతులకు వివరించారు. అలాగే గ్రామంలో సోకేపిట్స్, కంపోస్టు పిట్స్ కూడా ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి హామీలో ఉచితంగా అవకాశం కల్పిస్తామన్నారు. రైతులు తమ పొలంలో మామిడి చీనీ, సన్ననిమ్మ, జామ, సపోటా, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, మల్లె, మునగలాంటివి సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సీబీఆర్ ప్రాజెక్టు పరిశీలన



సీబీఆర్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎల్సీ చైర్మన్ జోగిరెడ్డి

లింగాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)ను సోమవారం తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఇప్పటికే ప్రాజెక్టులో 9.15 టీఎంసీల మేర నీటినిల్వ ఉందన్నారు. వరద ప్రవాహం పెరిగితే గేట్ల ద్వారా నదికి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఫోన్ ద్వారా సీఈతో మాట్లాడుతూ కూలిన రక్షణ గోడకు మరమ్మతులు, ప్రాజెక్టు గేట్ల ద్వారా అయ్యే లీకేజీలను, ఎన్‌ఓఎఫ్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, లింగాల సొసైటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, పీబీసీ ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించాలి

● ఎస్‌ఐ సుభహాన్ సూచన



మాట్లాడుతున్న ఎస్‌ఐ

పులివెందుల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించాలని అర్బన్ ఎస్‌ఐ సుభహాన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సరదా పేరుతో చేసే ర్యాగింగ్ విద్యార్థులపై భయాన్ని, అవమానాన్ని కలిగించే విధంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ కె.శేషమహేశ్వరమ్మ, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ సాంబయ్య, సీఎస్సీ విభాగాధిపతి జి.మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారుల పింఛన్ ఇవ్వాలి: తులసిరెడ్డి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

లింగాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భాగవత భక్త సమాజం సభ్యులకు ప్రభుత్వం కళాకారుల పింఛన్ మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వర ఆలయంలో జరుగుతున్న భాగవత సప్తాహ పఠనం ముగింపు రోజు సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ ఇతిహాసాలైన రామాయణం, భాగవతం, మహాభారతం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపాలన్నారు. కాగా కార్తీక సోమవారం కావడంతో కోనమల్లేశ్వరునికి తులసిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

తుఫాన్ వల్ల అప్రమత్తంగా ఉండండి

● ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్న అధికారులు ● అత్యవసర చర్యల నేపథ్యంలో పునరావాస కేంద్రాల ఏర్పాటు ● లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచనలు


జమ్మలమడుగు పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం


ఎర్రగుంట్లలో అధికారులతో స్పెషలాఫీసర్ సమీక్ష


కొండాపురంలో లోతట్టు ప్రాంతాలలో పర్యటించి పరిశీలిస్తున్న అధికారులు


పోరుమామిళ్లలో అధికారులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టరు

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆ మేరకు జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో మొంథా పునరావాస కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో సాయిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో జమ్మలమడుగు, దువ్వూరు, ముద్దనూరు మైలవరం, పెద్దముడియం, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు, ఎర్రగుంట్ల, కొండాపురం తదితర మండలాల్లో మొత్తం 32 పునరావాస కేంద్రాలు అందులో రూ.5,241 మందికి వసతులు ఏర్పాటు చేశారు. రిహాబిలేషన్ సెంటర్స్ తోపాటు అక్కడే ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే లోలివింగ్ ఏరియాస్ సబ్‌డివిజన్ పరిధిలో కుందూ, చెరువులు, వంకలు, వాగులు తదితర ప్రాంతాలకు సంబంధించిన వారి కోసం 27 కేంద్రాలు 3,215 మందికి వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎర్రగుంట్లలో: ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషలాఫీసర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభన్ బాబు, ఈవోఆర్డీ రంతుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషఫణీ, సీఐ విశ్వనాథరెడ్డి, ఏఈలు, ఆరోగ్యశాఖ ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం పెట్టారు. లోతట్టు ప్రాంతాలైన మాలేపాడు, హనుమనగుత్తి గ్రామాల్లో పునరావాస కేంద్రాలకు వాడుకునేందు కు సిద్ధంగా ఉంచారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

కొండాపురంలో: మొంథా తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. మండలంలో లోతట్టు ప్రాంతాలైన పి.అనంతపురం, రేగడిపల్లె, ఏటూరు, సుగుమంచిపల్లె గ్రామంలో సోమవారం వారు పర్యటించారు. పి.అనంతపురంలో ముచ్చుమర్రి ఎలిమెంటరీ స్కూల్, ఏటూరు గ్రామానికి తిమ్మాపురం ఎలిమెంటరీ స్కూల్, రేగడిపల్లె గ్రామానికి తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్, సుగుమంచిపల్లె గ్రామానికి దత్తాపురం జడ్పీహైస్కూల్ వద్ద పునారావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ గురప్ప, సీఐ రాజా, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్సైలు ప్రతాప్‌రెడ్డి, శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: మొంథా తుఫాను నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పెషలాఫీసర్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్త్రీశక్తిభవనంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి, వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ తుఫానుపై ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందన్నారు. అత్యవస పరిస్థితి ఏర్పడితే కంట్రోల్ రూమ్ 9441706801ను సంప్రదించాలన్నారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని సీఐ శ్రీనివాసులు తెలిపారు. పోరు మామి ళ్లలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో స్త్రీశక్తిభవనం, కలసపాడులో బాలుర ఉన్నత పాఠశాల పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరమైతే 9121100630కు ఫోన్ చేయాలన్నారు.

మైదుకూరులో: మొంథా తుఫాను కారణంగా మైదుకూరులోని చౌడేశ్వరినగర్‌లో నీటమునిగిపోయే అవకాశమున్న ప్రాంతాలను తహశీల్దారు, డీడీ సోషల్ వెల్ఫేర్ అధికారులు పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా స్థానిక శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డితో మాట్లాడి అక్కడ ముంపు ప్రాంత వాసుల కు షెల్టర్ ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు, టీడీపీ నాయకులు లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు.

బ్రహ్మంగారిమఠంలో: తుఫాను ప్రభావం నేపథ్యంలో మండలంలోని గుండాపురం చెరువు, సౌదరివారిపల్లె చెరవు వద్ద ఉన్న కాల్వ, ఎంపీపీ పాఠశాలలు తదితర వరద ముంపునకు గురవుతున్న ప్రదేశాలను సోమవారం మండల ప్రత్యేక అధికారి నాగయ్య, ఎంపీడీవో వై.రామచందారెడ్డి, తహసీల్దారు కార్తీక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడుతూ ఏ సమయంలో అయినా ఇబ్బంది పడితే సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు సచివాలయ సిబ్బందికి తెలపాలన్నారు. అనంతరం ఎంపీ డీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమై గ్రామాల్లో ప్రజలందరినీ అప్రమత్తం చేస్తుండాలన్నారు.

రాజుపాలెంలో: మొంథా తుఫాను ముంచుకొస్తుండడంతో జాగ్రత్తలు పాటించడంపై సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. తహసీల్దారు మనోహర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ షాకీర్‌అలీఖాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతమి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రమణమ్మ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో మండల అధికారులకు సమావేశంలో మాట్లాడుతూ మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు తాజా సమాచారం తీసుకోవడంతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సీఐ వంశీధర్, ఎంపీడీవో దివిజానంపతి, ఎంఈవో నాగరాజు, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

కలసపాడులో: తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు ఆర్డీఓ ఆదేశాల మేరకు కలసపాడులో పునరావాస కేంద్రం ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ మధురవాణి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో బాధితులకు అవసరమైన అన్ని వసతులను కల్పించినట్లు ఆమె తెలిపారు. ఎక్కడైన తుఫాన్ వల్ల ఇబ్బందులు ఎదురైతే టోల్‌ఫ్రీనెంబర్ 9030134306కు సమాచారం అందిస్తే వారికి వసతి కల్పిస్తామని ఆమె తెలిపారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండండి

కాశినాయన అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్టిలో పెట్టుకొని మండలంలోని పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారులు డాక్టర్‌రామారావు, డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ పాడి రైతులు గొర్రెలు, మేకలు, కోళ్ళు కలిగిన రైతులు సురక్షిత ప్రాంతాల్లో పశు సంపదను ఉంచుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాలల్లో, విద్యుత్ స్థంభాలకు,తీగలకు పశువులను కట్టేయరాదని సూచించారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

బద్వేలు , అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్డీవో ఎ.చంద్రమోహన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖలఅధికారులను అప్రమత్తం చేశామని మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు.పాత మట్టిమిద్దెలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ ఉండరాదని, అలాంటి వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే ఆయా మండల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసిప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఆర్డీవో కార్యాలయంలో కంట్రోలు రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కుందూ పరిసరాల్లో అప్రమత్తంగా ఉండండి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న స్పెషల్ ఆఫీసర్ హిదయతుల్లా

దువ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కుందూ పరిసర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ హిదయతుల్లా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిధిలో సోమవారం ఎంపీడీవో సుబ్బారెడ్డి, తహసీల్దారు సంజీవరెడ్డితోపాటు గ్రామ పంచాయతీల సెక్రటరీలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కుందూ పరిసర గ్రామాలైన కానగూడూరు, జిల్లేళ్ల, నేలటూరు పరిధిలో అలర్ట్‌గా ఉండాలని కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉండవద్దని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు చేరవేయాలని చెప్పారు.

అగస్త్యేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

● శివాలయం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



నూతన పాలక మండలి సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, హాజరైన టీడీపీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు టౌన్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రాశస్త్యం ఉన్న అగస్త్యేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అగస్త్యేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి తమ నివాసం నుంచి భారీ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య, నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంగల నారాయణరెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా తన సొంత ఖర్చులతో భక్తులను తిరుమలకు తీసుకెళుతున్నారని దీంతో ఆయన ఆలయాన్ని అభివృద్ధి చేస్తారన్న భావనతో శివాలయం ఛైర్మన్‌గా నియమించాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. ఆలయ నూతన ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా అవ్వారు చిన్న వెంకటరమణ, లక్ష్మిదేవి, సుభాషిణి, మాధవి, జయవర్ధన్‌రెడ్డి, శంకర్‌కుమార్, ఎస్.తిరుమలనాథ్, ఉట్టి వెంకటలక్ష్మి, డి.శివనాగేళ్ల నాగ విక్రాంత్, కాంతమ్మ, ఎక్స్ అఫియోమెంబర్ టి.మహేశ్వరశర్మలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, పట్టణాధ్యక్షులు చల్లా రాజగోపాల్‌యాదవ్, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, గంటశాల వెంకటేశ్వర్లు, రసూల్ గౌస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు పరిశీలన

బద్వేలు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాలను మండల స్పెషలాఫీసరు రాజ్యలక్ష్మి, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీవో మల్లీశ్వరిలు సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని వీరబల్లె వద్ద ఉన్న కల్వర్టు, కొంగలవీడు బ్రిడ్జిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ స్య ఎదురైనా పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తక్షణ సహాయ చర్యలు చేపడతారని తెలిపారు.

ఐలమ్మ కాలనీకి మంచినీరు అందించాలి

బద్వేలు , అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐలమ్మ కాలనీవాసులకు మంచినీరు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతమైన ఐలమ్మ కాలనీ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు అవుతున్నప్పటికీ తాగు నీటిని అందించకపోవడం బాధాకరమన్నారు. కాలనీవాసులు చందాలు పోగేసుకుని కొండ ప్రాంతానికిపైపులైన్ ఏర్పాటుచేసుకుని వీధి కుళాయిల ద్వారా నీటిని పట్టుకుంటున్నారని ఇది కూడా ఓర్వలేని ఓ వైసీపీ నాయకుడు ఏజంట్‌లా వ్యవహరిస్తూ వారు ఏర్పాటు చేసుకున్న పైపులైన్ ధ్వంసం చేశారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని లేకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, సుబ్బరాయుడు, మోక్షమ్మ, రాయప్ప పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

బద్వేలు , అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్‌లు కోరారు. సోమవారం పట్టణ7వ మహాసభలలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 13 గంటల పనిదినాన్ని రద్దు చేయాలని, మహిళలతో రాత్రిపూట షిఫ్ట్ పనులు చేయించే విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో హరి, ప్రవీణ్ , సీఐటీయూ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పాటించాలి

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. సోమవారం ఎస్.ఉప్పలపాడు గ్రామంలో (ఆదర్శ గ్రామం) స్థానిక ప్రజలు, పోలీసు అధికారులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలో శుభ్రత కార్యక్రమాలు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కాకినాడకు తరలి వెళ్లిన విద్యుత్ సిబ్బంది

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధి నుంచి సోమవారం సాయంత్రం 40 మంది సిబ్బందిని కాకినాడకు పంపడం జరిగిందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్ తెలిపారు. జమ్మలమడుగులోని విద్యుత్ కార్యాలయం వద్ద సిబ్బంది కాకినాడకు పంపారు. కాకినాడలో తుఫాను కారణంగా ఎలక్ట్రికల్‌కు సంబంధించి సమస్యలు వెంటనే పరిష్కారం చేయుటకు జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద నుంచి సిబ్బందిన పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.


భక్తిశ్రద్ధలతో తొలి కార్తిక సోమవార పూజలు


ప్రొద్దుటూరులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


అలంకరణలో నాగనాదేశ్వరుడు


ఖాజీపేటలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు టౌన్/ఖాజీపేట అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహాశివునికి ప్రీతికరమైన కార్తిక తొలిసోమవారం సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని శివుడికి అభిషేకాలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. ఉదయం, సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో సైకత లింగం, నవరత్నలింగం, జలలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు కార్తీక దీపాలతో నూతన శోభను సంతరించుకున్నాయి. కాగా ఖాజీపేటలోని నాగనాదేశ్వరకోన శివనామస్మరణతో మారుమ్రోగింది. మొదటి సోమవారం కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే మెట్లకు పూజలు చేసుకుంటూ ఓం నమఃశివాయ అంటూ కొండ ఎక్కి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినభక్తులకు కొండ కింది భాగంలో ఆర్యవైశ్యులు, భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా సీఐ వంశీదర్ పర్యవేక్షించారు.


జమ్మలమడుగు సుందరేశ్వరస్వామి


జమ్మలమడుగులో: ప్రముఖ శైవ క్షేత్రమైన కన్యతీర్థంలో సోమవారం కార్తిక సోమవారం పూజా కార్యక్రమాలు భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో పండితులు స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో కార్తికమాసం మొదటి సోమవారం భక్తులు భక్తిశ్రద్ధ లతో పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని లక్ష్మీమాధవరా యస్వామి ఆలయం, అమ్మవారిశాల, తిరుమలనాథస్వామి, ము క్కొండ మల్లేశ్వరుడు, వనిపెంట చెన్నకేశవస్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు.

కొండాపురంలో: మొదటి కార్తిక సోమవారం కావడంతో శైవ క్షేత్రాల్లో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వరకోన, దొంతికోన తదితర చోట్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అదేవిధంగా కొండాపురం,గండ్లూరు,సుగుమంచిపల్లె తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలప్పకోన, మల్లేశ్వరకోన తదితర చోట్ల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో కార్తిక మొదటి సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాత దువ్వూరులోని భీమలింగేశ్వరాలయం, పుల్లారెడ్డిపేటలోని త్రిపీటిక ఆలయంలో పూజలు నిర్వహించారు.

శైవక్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు


ప్రత్యేక అలంకరణలో శివుడు


దీపాలను వెలిగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

బద్వేలుటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తిక మాసం మొదటి సోమవారం ప్రారంభం కావడంతో శైవక్షేత్రాల్లో భక్తులు పరమశివుడికి బిల్వార్చన, రుద్రాభిషేకం తదితర విశేషపూజలు చేశారు. శివాలయాల్లో మహిళలు కార్తిక దీపాలను వెలిగించి తమ ఇష్టదైవమైన పరమశివుడిని ఆరాధించారు.

రూపరాంపేట శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ కలెక్టర్

పరమశివుడికి ప్రీతికరమైన కార్తికమాసం తొలిసోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అతిపురాతనమైన శివానందస్వామి ఆలయాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ శంకర్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంబం వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయకమిటీవారు తీర్థప్రసాదాలు అందించారు.



పోరుమామిళ్లలో: భక్తిశ్రద్ధలతో కార్తిక తొలిసోమవారం సందర్భంగా శైవక్షేత్రాల్లోపూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం బ్రాహ్మణవీధిలో వెలసిన బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆయలంలో సుప్రభాత సేవ, సామూహిక పంచామృతాభిషేకాలు, మంగళహారతి నిర్వహించారు. అలాగే లింగమయ్యస్వామి సమీపంలోని శివాలయంలో గోశృంగ మల్లికార్జునస్వామి ఆలయంలో టేకూరు పేట శివాలయంలో అమ్మవారిశాలలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్టీయూ మండలశాఖ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

బి.కోడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) బికోడూరు మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన , ఆర్థిక కార్యదర్శులుగా బి.శ్రీనివాసులు, బి.నాగసుబ్బారెడ్డి, ఎస్.శ్రీనివాసులు ఎన్నికయ్యారని రీజనల్ కన్వీనరు వీవీ క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు బి.వెంకటరామయ్య, ఎస్.రాజగోపాల్‌రెడ్డిలు తెలిపారు. ఎస్టీయూ రీజనల్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు వారు తెలిపారు. ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఆర్థిక కమిటీ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లుగా పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

కలసపాడులో: ఎస్టీయూ కలసపాడు మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆశాఖ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబులు తెలిపారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్వీ సత్యనారాయణ, ఎం బాలరాజునాయక్, ఆర్థిక కార్యదర్శిగా గురుప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అసోసియేట్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులుగా వై.నాగిరెడ్డి, ఎంవీ రమణ, బి.భాస్కర్‌రెడ్డిలతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ మెంబర్లుగా పలువురు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు వారు తెలిపారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని ఎంపికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

3 నుంచి టెట్, డీఎస్సీకి ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టెట్, డీఎస్సీకి సిద్ధమయ్యే అభ్యర్థులకు నవంబరు 3వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి నంగా రాజేష్ తెలిపారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెకండ్‌గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఇంగ్లీషు, సైకాలజీ సబ్జెక్టులలో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలతో శిక్షణ కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జేవీవీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు సునీత, గోపీనాథరెడ్డి, రాకేష్, బాలనరసింహులు, రవిబాబు, యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపసుపులలో రచ్చబండ కార్యక్రమం

పెద్దముడియం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పెద్దపసుపుల గ్రామంలో సోమవారం వైసీపీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఇతర నాయకులు హాజరై కోటిసంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ రూపంలో ఏర్పాటు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.